సొదుం జయరాం కథలు

4

# మర్యాదస్తులు

ప్రభాకరరెడ్డి కృష్ణాపురం దగ్గర బస్సు దిగాడు. తను వెళ్లవలసిన ఊరు పేరు తప్ప, అది కృష్ణాపురానికి ఎంత దూరంలో ఉందో- ఏ దిక్కున ఉందో కూడా తెలీదు. బస్టాండ్ దగ్గరే ఒక చిన్న టీ హోటలు ఉంది. అక్కడ ఐదారుమంది కూచొని టీ తాగుతున్నారు. ప్రభాకరరెడ్డి వారి దగ్గరికివెళ్లి "ఏమండీ రంగరాజుపల్లెకు ఎలా వెళ్లాలి?" అంటూ ప్రశ్నించాడు. టీ తాగుతున్న ఒకతను లేచివచ్చి "ఇదిగో ఈ దారి వెంట వెళ్లండి. అట్టే దూరం లేదు. రెండు మైళ్లు" అంటూ దారి చూపాడు.

రెండు మైళ్లు అనగానే ప్రభాకరానికి భయం పట్టుకుంది. టైం చూచాడు. ఐదు అయింది. ఎంతలేదన్నా అక్కడికి వెళ్లేసరికి ఆరు, ఆరున్నర అవుతుంది. బాగా చీకటికూడా పడవచ్చు. తీరా వెళ్తే అక్కడ ఆ కరణంగారు ఉన్నారో లేరో? ఆయన లేకపోతే భోజనం, పడక అన్నీ ఇబ్బందులే. అక్కడ నుంచి ఇక్కడికి రావాలంటే మళ్లీ రెండు మైళ్లు నడవాలి- తప్పదు. ఉద్యోగం అంటూ ఒకటి ఏడ్చాక ఇబ్బందులు పడక తీరదు, అని తనకు తాను సర్దిచెప్పుకొని కాళ్లీడ్చుకుంటూ బయలుదేరాడు.

దారి బాగానే ఉంది. తను అనుకున్న టైమ్‌కు కాస్త ముందే ఊరు చేరుకున్నాడు. చిన్నపల్లె. అట్టే మనుషులు కూడా కన్పించడం లేదు. కాసేపటికి ఓ పెద్దమనిషి కనిపించాడు.

"ఏమండీ! కరణంగారిల్లు ఎటువేపో కొంచెంచెబుతారా?" అంటూ ప్రభాకరం ఆ పెద్దమనిషిని అడిగాడు.

"ఎవరూ, చెవిటి నారాయణరావుగారి ఇల్లా, ఇదిగో ఇటే వెళ్లి మలుపు తిరగండి. మూడో యిల్లు. మేడ" అంటూ గుర్తుచెప్పాడు.

కరణం గారి పేరు నారాయణరావుగారన్న మాట. ప్రభాకరం మలుపు తిరిగి మేడముందు నిలిచాడు. పాతకాలపు మేడ-పెద్దదే. వాకిట్లో నిలబడి "నారాయణరావుగారూ" అని కేకవేశాడు ప్రభాకరం.

'ఎవరూ' అంటూ ఇంట్లోనుంచి స్త్రీ కంఠం. ప్రభాకరానికి కొంచెం చిరాకు కలిగింది. తను ఎవరైందీ ఇక్కడినుంచే కేక పెట్టాలా? ఏం సమాధానం చెప్పకుండా నిలబడ్డాడు. సమాధానం రాకపోయేసరికి ఇంట్లోనుంచి ఒక అమ్మాయి వచ్చి ప్రశ్నార్థకంగా ప్రభాకరం వైపు చూసింది.

"నారాయణరావుగారు లేరాండీ?" అన్నాడు ప్రభాకరం.

"ఇంట్లో లేరు. ఊళ్లో ఉన్నారు" అంటూ ఆ అమ్మాయి సమాధానం చెప్పింది.

ప్రభాకరానికి గుండెలు కుదుటపడ్డాయి. ఆ అమ్మాయి ఊళ్లో లేడని ఎక్కడ అంటుందో- తను ఏ చావు చావాలి అని ఆలోచిస్తున్నాడు.

"ఎవరినన్నా పంపి పిలిపించండి. తాలూకా ఆఫీసునుంచి స్టాటిస్టికల్ అసిస్టెంట్ వచ్చాడని చెప్పి పంపండి" అన్నాడు ప్రభాకరం. ఎవరో ఉద్యోగి అని అర్థం అయ్యాక "లోపలికి వచ్చి కూర్చోండి" అంటూ ఆ అమ్మాయి కుర్చీ చూపించింది.

దొడ్లో కట్టెలు కొడుతున్న మనిషిని కేకేసి "వెళ్లి నాన్నగారు ఎక్కడున్నారో పిలుచుకురా. ఎవరో తాలూకా ఆఫీసునుంచి వచ్చారని చెప్పు" అంటూ వాడికి పురమాయించి ప్రభాకరంవైపు తిరిగి "మంచినీళ్లు తాగుతారా?" అంది. రెండు మైళ్లు నడిచి వచ్చాడు. దాహంగానే ఉంది. 'ఇవ్వండి' అన్నాడు. ఆ అమ్మాయి నీళ్లు తెచ్చి యిచ్చింది. నీళ్లు తాగగానే సగం ప్రాణం కుదుటపడింది.

ఒకసారి ఇల్లంతా కలయచూశాడు. ఇంట్లో ఎక్కడా మనుషుల అలికిడి లేదు. కరణంగారు, ఈ అమ్మాయి ఇద్దరే ఉంటున్నారేమో! ఈ అమ్మాయికి ఇంకా పెళ్లికాలేదేమో. అన్న సందేహాలు కలిగాయి.

"ఏమండీ! కాఫీ తీసుకుంటారా?" అంది ఆ అమ్మాయి లోపల్నుంచి. ఇచ్చేదేదో అడక్కుండా ఇస్తే బాగుంటుంది. తీసుకుంటారా అంటే తీసుకుంటాననడం ఏం మర్యాద? "అబ్బే అవసరం లేదండీ" అన్నాడు. కాని మనసు కాఫీ మీదకే వెడుతోంది. వచ్చేటప్పుడు టీ హోటల్లో టీ తాగుదామనుకున్నాడు. కానీ- ట్వీడు పాంటుతో అక్కడ కూర్చోవడం ఇష్టంలేక- టీ తాగలేదు.

ఆ అమ్మాయి, ప్రభాకరం మొగమాట పడుతున్నాడని గ్రహించినట్టు ఉంది. కప్పుతో కాఫీ తెచ్చి "ఫరవాలేదు తీసుకోండి- బ్రూ కాఫీ" అంది.

కప్పు అందుకుంటూ కాళ్లవైపు చూశాడు. మెట్టెలున్నాయి. పెళ్లయిన అమ్మాయే.

కాఫీ తాగుతుండగా నారాయణరావుగారు వచ్చారు. వచ్చీ రాగానే నమస్కారం చేశాడు. "నేను స్టాటిస్టికల్ అసిస్టెంటునండీ" అంటూ తన్ను తాను పరిచయం చేసుకున్నాడు ప్రభాకరం. నారాయణరావు నవ్వుతున్నాడు.

"నాన్నగారికి అట్లాంటి మాటలు వినిపించవు. కొంచెం గట్టిగా మాట్లాడాలండీ" కరణంగారి అమ్మాయి వంటింట్లోనుంచి నవ్వుతూ అంది.

ప్రభాకరానికి చటుక్కున జ్ఞాపకం వచ్చింది. ఈసారి అదే మాటను సాధ్యమైనంత గట్టిగా చెప్పాడు.

ఆయన అంతకన్నా గట్టిగా నవ్వి "మీరా! డిప్యూటీ తహశీల్దారేమోనని పరుగెత్తుకొచ్చాను" అన్నాడు.

ప్రభాకరానికి ఈ జవాబు కోపమే తెప్పించింది. కానీ కోపాలకూ, తాపాలకూ కాలం కాదు ఇది. బతిమాలి పనులు చేయించుకోవాలి.

ప్రభాకరం తాను వచ్చినపని చెప్పాడు. సాంతం ఆయనకు వివరించేసరికి గొంతు బొంగురు పోయింది. ఆయన అంతా విని "సరేలెండి. రాత్రి కూచొని మీకు కావలసిన లెక్కలన్నీ వేసి యిస్తాను" అని, వంటింటిముందు నిలబడి "నిర్మలా! ఈయనకు కూడా వంట చెయ్యమ్మా" అని కేక పెట్టాడు. ఆ అమ్మాయికి కూడా చెవుడు వున్నట్టు.

ఎనిమిదింటికి నిర్మల వచ్చి "భోజనానికి లేవండి" అంది. 'ఎనిమిదింటికే ఏం భోజనమండీ?' అన్నాడు ప్రభాకరం. "పల్లెలు కదండీ ఏం పనులుంటాయి. ఎనిమిదింటికి భోంచేసి తొమ్మిదింటికి నిద్రపోతాం" అంది ఆ అమ్మాయి.

భోంచేస్తూ ప్రభాకరం "ఏమండీ! అమ్మాయి, మీరు ఇద్దరే ఉంటున్నారా?" అన్నాడు కరణం గారిని ఉద్దేశించి.

"మీరు అంత మెల్లగా మాట్లాడితే ఆయనకు వినిపించదండీ" అంది కూర వడ్డిస్తూ నిర్మల.

ప్రభాకరం ఆయనకు చెముడని మర్చిపోయి మామూలుగా మాట్లాడినందుకు నాలుక కర్చుకున్నాడు. నిర్మలే సమాధానం చెప్పింది.

"అమ్మ జబ్బుపడి హాస్పిటల్లో ఉందండీ. నాన్నగారు మీరొచ్చే ముందుగానే హాస్పిటల్ నుంచి వచ్చారు. నన్ను ఇక్కడే దగ్గర రంగాపురానికి ఇచ్చారు. నాన్నకి ఇబ్బందని వచ్చాను."

"ఏమ్మా నీ భర్త యేం చేస్తాడు?" అన్నాడు ప్రభాకరం.

"చదువుకున్నవాడు కాదండి, వ్యవసాయమే" అంది.

"ఏమిటి?" అన్నాడు నారాయణరావు కలుగజేసుకొని.

"మీ అల్లుడుగారు ఏం చేస్తారు?" అని అడుగుతున్నాను.

నారాయణరావుగారు ఇల్లు ఎగిరిపోయేటట్టు నవ్వారు.

"అల్లునికేం, నాలుగు లక్షల అధికారి. నాలుగు తరాలు కూచొని తిన్నా తరగదు" అన్నాడు నవ్వు మధ్య.

"చదువులంటే పొట్టకూటి చదువులయిపొయ్యాయి. ఇంత ఆస్తిపాస్తులున్నదానికి సమానం లేదు" అన్నాడు ప్రభాకరం.

"మీరు బాగానే చెబుతారు" అంది ఆ అమ్మాయి నవ్వుతూ. అంటే అర్థం బాగా చెప్పినట్టా, చెప్పనట్టా అన్నది- ప్రభాకరానికి బోధపడలేదు.

భోజనం ముగించి లేచి వచ్చారు. ఆ అమ్మాయి తాంబూలం తెచ్చిపెట్టింది.

"అలవాటు లేదండీ" అన్నాడు ప్రభాకరం.

"ఫరవాలేదు వేసుకోండి" అన్నది. ఆ అమ్మాయి మాటలు అవీ చూస్తే, మర్యాదా, మన్ననా తెలిసిన వ్యక్తి లాగుంది- అనుకున్నాడు ప్రభాకరం.

తాంబూలం వేసుకున్న తర్వాత "ఏమండీ! ఇక మనం లెక్కలు చూద్దామా?" అన్నాడు ప్రభాకరం.

కరణంగారు రికార్డులన్నీ తీసి లాంతరు ముందు పెట్టాడు.

ఇంతలో నలుగురైదుగురు వచ్చి కింద కూచున్నారు.

"ఏరా ఇలా వచ్చారు?" అన్నాడు నారాయణరావు.

"ఇదిగో ఈ మునిగాడి విషయమే. నాలుగు రోజులుగా మీ ఇంటిచుట్టూ తిరుగుతున్నాం. మీరు ఊళ్లో లేరు. ఈ రోజన్నా ఏదో ఒకటి చెయ్యండి" అన్నాడు వాళ్లలో ఒకడు.

"వేళా పాళా లేదురా పంచాయతీకి" అన్నాడు కరణంగారు.

"మళ్లీ పొద్దున కోతలు. తీరుబాటెక్కడ సామీ?" అన్నాడు వాడు.

"సరే లచ్చిని, దాని తల్లిని కూడా పిలిపించండి" అన్నాడు కరణంగారు. ప్రభాకరం వైపు తిరిగి "ఇక మన పని ఉదయమేనండి. వీళ్లది చిన్న తగాదా ఒకటి ఉంది. అదేదో చూడాలి" అన్నాడు.

రామాయణంలో పిడకల వేటలా మధ్యలో తన పనికి ఆటంకం కలిగినందుకు, ప్రభాకరానికి విసుగ్గానే ఉంది. కానీ ఏం చెయ్యగలడు.

"ఏమిటండీ ఈ పంచాయతీ" అన్నాడు ప్రభాకరం.

"ఈ పాడు గొడవలు మీకెందుకు లెండి" అంది నిర్మల ఇల్లు సర్ది బయటకు వస్తూ.

"ఒరే! అయ్యగారికి మంచం బయట వెయ్యి పడుకుంటారు" అంటూ వచ్చిన వాళ్లలో ఒకరికి పని పురమాయించింది.

"అవును. మీరు వెళ్లి పడుకోండి" అన్నాడు కరణంగారు.

"లేదులేండి. నేనూ వింటాను కాసేపు కాలక్షేపం. అయినా ఎనిమిది కాలేదు, అపుడే నిద్రకు తొందరేమొచ్చింది" అన్నాడు ప్రభాకరం. నిర్మలకూడా తాంబూలం నములుతూ గడపమీద కూర్చుంది.

"విషయమేమిటండీ?' అన్నాడు ప్రభాకరం మళ్లా.

కరణంగారు వారితో మాటల్లో మునిగి పోయాడు. ఇక ప్రభాకరం మాటలు చెవుల్లో ఏం పడతాయి? నిర్మలే వివరించింది.

"అక్కడ కూర్చున్నాడు చూడండి- వాణ్ణి- వాడిపెళ్లాం వదిలేసింది, అదీ తగాదా" అంది. కరణం గారితో వాళ్ల ఇల్లు ఎత్తిపోయేట్టు తమ వాదన చెబుతున్నారు. ఆయన వింటున్నాడు.

"ఎందుకు వదిలిందండీ?" అన్నాడు నిర్మలతో.

"అలగా జనం, అలగా బుద్ధులు" అంది నిర్మల.

ప్రభాకరం ఆ భార్యా బాధితుడివైపు చూచాడు. మంచి కండపుష్టి, లక్షణంగా ఉన్నాడు. వీణ్ణి వదలటానికి ఆ పెళ్లానికి మనసు ఎట్లా వొప్పిందో అర్థంకాలేదు.

ఇంతలోనే అవతల పార్టీ వాళ్లు కూడా వచ్చారు. ఇద్దరే వచ్చారు. ఆ అమ్మాయి, ఆ అమ్మాయి తల్లీ.

కరణంగారు కాపరానికి పంపమని తల్లికి చెబుతున్నాడు. ఆ తల్లి "నాదేముంది దానికి ఇష్టమైతే" అంటోంది. ఆ కూతురు ఉలకనూ లేదు, పలకనూ లేదు. ఆ అమ్మాయి కూడా బాగానే ఉంది. ఇద్దరిదీ ముచ్చటైన జంట. ఇద్దరి మధ్య ఎందుకు బెడిసిందో ప్రభాకరానికి అర్థంకాలేదు.

"ఏమే లచ్చీ, బెల్లంకొట్టిన రాయిలా కూర్చుంటే లాభం లేదు. మొగుణ్ణి విడిచి నీ ఇష్టమొచ్చినట్లు తిరుగుతానంటే, ఇది ఊరా పాడా? నిన్ను జూచి ఇంకా నలుగురు నేర్చుకుంటారు" అంటూ కరణంగారు గదమాయిస్తున్నాడు.

"ఏ బావిలోనైనా దూకి చావనైనా చస్తానుగాని, కాపరానికి పోను" అంటోంది ఆ అమ్మాయి.

ఏదో కారణం ఉండాలనిపించింది ప్రభాకరానికి.

"ఏమండీ ఆ అమ్మాయి ఎందుకు వెళ్లనంటోంది?" అన్నాడు ప్రభాకరం నిర్మలతో.

"ఏం లేదండీ! వీడు తాగుబోతు వెధవ. తాగి దీన్ని బాగా తంతాడు. పైగా ఎవత్తెనో ఒకదాన్ని ఉంచుకొన్నాడట. దీనికి కొంచెం అభిమానం జాస్తి" అంది.

"అయితే ఆ అమ్మాయి పట్టుదలకు కారణం ఉందన్నమాటే."

"మెడన పడ్డ పాము కరవక మానదని, కట్టుకున్నాక తప్పుతుందా? ఎలాగో సర్దుకుపోవాలి. ఈ అలగా జనానికి ఆ తెలివి లేదండీ. పరువా, ప్రతిష్టా? లోకానికీ భయంలేదు- సంఘానికీ భయంలేదు. బ్రతుకు తెరువు పోతుందే అనన్నా భయపడటానికి అదీ లేదు. ఎక్కడ ఉన్నా రెక్కల కష్టం తప్పదు' ' అంది నిర్మల.

కరణంగారు నయానా భయానా కూడా ఆ అమ్మాయికి నచ్చచెప్పి చూశాడు. కాని ఆ అమ్మాయి తన అభిప్రాయాన్ని మార్చుకోలేదు.

కరణంగారు చెప్పి చెప్పి విసుగొచ్చాక "మీ తాడు ఎలానన్నా తెంచుకోండి. ఈ పంచాయతీ నేను చెయ్యలేను" అంటూ అపజయాన్ని అంగీకరించాడు.

వాళ్లు చేసేదిలేక కరణంగారితో సెలవు తీసుకొని వెళ్లిపోయారు.

"ఈ అరుపులకు తలనొప్పి వచ్చింది" అంటూ నిర్మల తల పట్టుకుంది.

"వాడికేమండీ, మగ మహారాజు. తాగుతాడు, ఒకరికి బదులు నలుగుర్ని ఉంచుకుంటాడు. ఇది నాకు మొగుడు అక్కర్లేదంటే ఏమన్నమాట. "మదపు లం..." అంటూ కరణంగారు బూతులు తిట్టటానికి మొదలుపెట్టాడు.

"సరే, ఇంకా ఎందుకు ఆ పాడు గద్దె. ఇక పడుకోండి" అంటూ నిర్మల వాళ్ల నాన్న చెవిదగ్గర కేక పెట్టింది.

ఇందాక వచ్చిన వాళ్లతో నిర్మల మంచాలు బయట వేయించి పరుపులు పరిపించి పెట్టింది. ముగ్గురూ వచ్చి పడుకున్నారు.

ఆకాశంలో బాగా మబ్బులుపట్టి చీకటిగా ఉంది. ఊరు అప్పుడే మాటు మణిగి నిశ్శబ్దంగా ఉంది. అప్పుడప్పుడు కప్పల అరుపులు మాత్రం వినిపిస్తున్నాయి. ప్రభాకరం ముసుగుదన్ని పడుకున్నాడు. కాని నిద్ర రావడం లేదు. కరణంగారు అప్పుడే గుర్రు పెడుతున్నాడు. ప్రభాకరానికి ఏమీ తోచక సిగరెట్టు తీసి వెలిగించాడు.

"ఏమండీ నిద్ర రావడం లేదా?" అంది నిర్మల. ప్రభాకరం ఉలిక్కిపడ్డాడు. పండ్రెండయింది. ఆమె ఇంకా మేల్కొనే ఉంది.

"మీకూ నిద్ర రాలేదా?" అన్నాడు ప్రభాకరం.

"వర్షం వస్తుందేమో చలిగాలి కొడుతూంది" అంది నిర్మల.

ప్రభాకరం మంచంమీద లేచి కూర్చున్నాడు. నిర్మల ఇంకా ఎందుకు మేల్కొని ఉంది? నిర్మల మనసులో... తన అంచనా పొరపాటయితే తను మళ్లీ ఊరు మొగం చూడలేడు. ఎలా కనుక్కోవడం? నిర్మల మంచంవైపు చూశాడు. చీకట్లో కళ్లు మెరుస్తున్నాయి. వెలిగించిన సిగరెట్టుతో సైగ చేశాడు. ఆ అమ్మాయి నవ్వుతున్నట్టుంది. తెల్లగా పళ్లు కనిపిస్తున్నాయి. ధైర్యంచేసి మంచం దగ్గరకు వెళ్లాడు. నిర్మల పక్కకు జరిగి స్థలం చూపించింది. వెచ్చగా నిర్మల వంటి స్పర్శ తగిలే వరకూ- ప్రభాకరం ఇది కలగాదు గదా అనుకుంటూనే ఉన్నాడు.

* * *

ప్రభాకరం నిర్మల పక్కమీదనుంచి లేచివస్తూ కరణంగారి వైపు చూశాడు. ఆయన గుర్రు పెడుతూనే ఉన్నాడు. తాను చేసిన సాహసం తలుచుకుంటే భయం కలిగింది. తెల్లారగట్ల మూడింటికి మళ్లీ ఆ భయం తొలిగింది.

ఉదయం లేచేసరికి ప్రభాకరం కళ్లు జ్యోతుల్లా ఉన్నాయి. అసలు కన్ను మూసింది ఎప్పుడు గనక?

"అదేమిటి కళ్లు అలా ఉన్నాయి?" అన్నారు కరణంగారు.

"కొత్త చోటు కదండీ, నిద్రపట్టలేదు" అన్నాడు ప్రభాకరం.

"అబద్దాలు చెప్పకండి- ఆడపిల్లలు పుడతారు" అంది నిర్మల అటువైపు తిరిగి.

"నీకా, నాకా!" అన్నాడు ప్రభాకరం పెదవుల కదలిక కరణంగారికి కనిపించకుండా, ముఖం ప్రక్కకు తిప్పి.

కాఫీ తాగిన తరువాత గంటలో ప్రభాకరం పని పూర్తిచేసుకున్నాడు.

"ఇక మీరు వెళ్లొచ్చు" అన్నాడు కరణంగారు. ప్రభాకరానికి బాధగానే ఉంది.

"జిప్ బ్యాగ్ ఉంది. వెట్టివాణ్ణి పంపండి నాన్నా రోడ్డుదాకా" అంటూ నిర్మల సిఫార్సు చేసింది. కరణంగారు వెట్టికి జిప్ అందించాడు.

ప్రభాకరం ఇద్దరితోనూ ఒకేసారి "వస్తానండీ" అన్నాడు.

"వెళ్లిరండి" అంది నిర్మల.

ప్రభాకరం దారిపట్టాడు కాని- స్వర్గం వదలి వస్తున్నట్లుగా వుంది. రోడ్డు దగ్గరికి వచ్చేసరికి రెండు గంటలు పట్టింది. వెట్టి టీ తాగడానికని హోటల్లోకి దూరాడు. జిప్ బ్యాగ్ వాడి దగ్గరే ఉంది. దూరాన బస్సు వస్తోంది. బ్యాగ్ కోసమని హోటల్‌లోకి వచ్చాడు. తన వెంట వచ్చిన వెట్టివాడు ఎవరో "ఆడంగి రేకుల" వాణ్ణి ఆట పట్టిస్తున్నాడు.

"బస్సు వస్తోంది బ్యాగ్ ఇలా ఇవ్వు" అన్నాడు.

వాడు బ్యాగ్ చేతికిచ్చి "మన కరణంగారి అల్లుడండీ, ఇప్పుడే బస్సు దిగాడు" అన్నాడు.

ఆ "ఆడంగి రేకులవాడు" నిర్మల మొగుడా? ప్రభాకర్ షాక్ తిన్నాడు.

**- (6 నవంబర్ 1970, ప్రగతి వారపత్రిక, రష్యన్‌లోకి అనువాదం- 1970)**